# కర్మ, భక్తి, జ్ఞానములు మూడింటి లక్ష్యము ఒక్కటే!

కర్మ మార్గము విడరాని కాలిబాట
భక్తి మార్గము సులువైన బండిబాట
జ్ఞానమన విమానంబుపై యాన మరయ
సత్యమైన బాట ఈ సాయి మాట

విద్యార్థులారా!

ప్రాచీన కాలమునుండి కర్మోపాసన, జ్ఞానములయొక్క విషయమై అనేకమంది అనేకవిధములైన వాదోపవాదములు జరుపుతూ ఇది గొప్పది, ఇది చిన్నది అనే నిర్ణయమునకు రాలేక అయోమయస్థితిలో కాలమును వ్యర్థము గావిస్తూ వచ్చారు. కాని, విశాలహృదయులైనవారు విచారణ చేసినప్పుడు మూడింటియొక్క రూపనామములు భిన్నముగా కనిపించినప్పటికి, గమ్యము ఒక్కటేనని తెలుస్తుంది.

**కర్మ, భక్తి, జ్ఞానముల ఏకత్వమును గుర్తించుటే నిజమైన మానవత్వము**

కర్మ, ఉపాసన, జ్ఞానము మూడు త్రివేణీ సంగమమని భావిస్తూ వచ్చారు ప్రాచీనులు. భక్తి అనగా యమునా నది. ఇది నిర్మల నిశ్చల నిస్వార్థమైన తత్త్వము. కర్మ అనగా గంగానది. శరీరమాద్యం ఖలు ధర్మసాధకం. ఈ కర్మలన్నీ కేవలం జ్ఞానమును బోధించేవే. నిరంతరము ఈ శరీరములో గావించే కర్మలన్నీ పవిత్రంగా ఉండాలి. ఈ యమున, గంగ అనే కర్మోపాసనలు రెండు బాహ్యంగా కనిపిస్తాంటాయి. కర్మ, భక్తి ప్రభావములు రెండు మానవునియొక్క ఆచార, విచారములచేత మనకు స్పష్టమవుతూ ఉంటాయి. కానీ, జ్ఞానమనేది అంతర్వాహిని యైన సరస్వతి వంటిది. సరస్వతి కనిపించదు. ఈ జ్ఞానమునకు ఒక రూపము లేదు. జ్ఞానము కేవలం ఆచార, సాంప్రదాయములచేత అవ్యక్తమై ఉంటుంది. కేవలం ఆవిర్భవించేదే గానీ, ప్రకటించేది కాదు. సర్వకర్మలయొక్క ప్రభావము ఈ జ్ఞానముపైనే ప్రసరింప చేస్తుంది. కర్మ

sri sathyasai vachanamrutam

అనేది పుష్పము వంటిదని, ఉపాసన అనేది పిందెవంటిదని, జ్ఞానము ఫలము వంటిదని అన్నారు. పుష్పము లేక కాయ లేదు. కాయ లేక ఫలము లేదు. మూడింటి పరిణామములు వేరువేరు అయినప్పటికిని వీటి గమ్యం ఒక్కటే. వీటి సత్యం ఒక్కటే. వీటి లక్ష్యము కూడా ఒక్కటే. కనుక కర్మ లేక ఉపాసన గానీ, ఉపాసన లేక జ్ఞానముగానీ లభ్యము కావు. 'చిత్తస్య శుద్ధయే కర్మః.' చిత్తశుద్ధి నిమిత్తం ఈ కర్మలాచరించటం. శరీరంతో గావించే కర్మలన్నియు శుద్ధమైన భక్తితో విచారించేది భక్తి అనియు, ఈ శుద్ధమైన భక్తియే సిద్ధమైన జ్ఞానమును లభింపచేస్తుందని ఈ మూడింటియొక్క సత్యము ఒక్కటేయని ప్రబోధిస్తూ వచ్చింది వేదాంతము. దీనినే త్రికరణ శుద్ధి అని చెబుతూ వచ్చారు. అట్టి త్రికరణ శుద్ధి గలవాడే మానవుడు. Thoughts, words, actions ఈ మూడింటియొక్క ఏకత్వమే కర్మమార్గము. ఉచ్చరించటమే ఉపాసనా మార్గము. సంకల్పించటమే జ్ఞానమార్గము. సంకల్పమును పురస్కరించుకొనియే వాక్కు, వాక్కును పురస్కరించుకొనియే కర్మ. ఈ మూడింటియొక్క ఏకత్వాన్ని గుర్తించటమే నిజమైన మానవత్వము.

ఈనాడు ఇట్టి మానవత్వమును గుర్తించుకొనలేక, కర్మోపాసన జ్ఞానములు వేరువేరుగా భావించి అనేక విధములైన వాదోపవాదములతో కాలమును వ్యర్థము గావిస్తున్నారు ప్రజలు.

**పాపభీతిలేని పామరత్వము బట్టి**
**దైవప్రీతి లేనిదాని బట్టి**
**మానవత్వ మణిగె మానవులందున**
**ఇదియె చిత్రమంచు నుడివె సాయి**

ఈనాటి మానవుడు ఏమి ఉచ్చరించుచున్నాడో, ఏ పలుకులు పలుకుతున్నాడో తనకే తెలియదు. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి అనేవి తాను తెలుసుకో లేకపోతున్నాడు. ప్రీతిని కలిగించే పలుకుకూడా సత్యమైన పలుకుగా ఉండాలి.

**జిహ్వే రసజ్ఞే మధురప్రియేత్వం**
**సత్యం హితం త్వాం పరమం వదామి**
**ఆవర్ణయేథా మధురాక్షరాణి**

sri sathyasai vachanamrutam

**గోవింద దామోదర మాధవేతి.**

"ఓ నాలుకా! నీవు సద్గుణములు పలికే నాలుకవు. నీవు మృదుమధురమైన నాలుకవు. నీవు శాంత స్వభావమైన నాలుకవు." ఈ నాలుకచేత నరుడు దివ్యత్వము నందుకుంటున్నాడు. దీనినే భగవద్గీతయందుకూడా "అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్" – మనం పలికే వాక్యము ఉద్వేగం కలిగించేదిగా ఉండకూడదు. ఇది సత్యమైన పలుకుగా ఉండాలి. హితము నందించే పలుకుగా ఉండాలి. ఎదుటి వ్యక్తికి అసంతృప్తిని కలిగించరాదు. అదే సత్యము. సత్యమునే పల్కాలి. 'ఈ సత్యము అతనికి ప్రియంకాదు కదా' అని అసత్యమును చెప్పరాదు. నీవు సత్యాసత్యములు రెండూ విచారించి మౌనము దాల్చినా మంచిదేగానీ అసత్యమును మాత్రము చెప్పకూడదు.

కర్మోపాసన జ్ఞానములయొక్క లక్ష్యము ఒక్కటే. అదే దివ్యత్వమునకు పవిత్రమునకు సరియైన సోపానము. ఈ కర్మచేతనే మనము ఎన్నో విధములైన ధర్మము లాచరిస్తూ వస్తున్నాము. గమ్యమును మాత్రము మనం విచారించటానికి పూనుకోవటం లేదు. ఇప్పుడు కాదు కాని, పూర్వము రైల్వే డిపార్టుమెంటులో మూడు విధములైన ప్రయాణ సౌకర్యములుండేవి. ఒకటి, సామాన్యమైన రైలులో ప్రయాణం చేయటం. నీవు ధర్మవరంలో ఎక్కి హైదరాబాదు చేరాలని అనుకుంటావు. కానీ ధర్మవరంలో ఎక్కిన ట్రైను గుంతకల్లులో మారవలసి రావచ్చు. ఒకదగ్గర ఎక్కి మరొక దగ్గర దిగి సామాను దింపుకొని తిరిగి యింకొక రైలు ఎక్కటం, ఇది కొంచెం కష్టంగా ఉంటుంది. రెండవరకమైనది, Through carriage ఈ క్యారేజీలో కూర్చుంటే నీవు మారనక్కరలేదు. రైల్వేవారే ఈ క్యారేజిని మరొక రైలుకు అతికిస్తారు. మూడవ రకము through train, ఇది జ్ఞానమార్గమువంటిది. Through compartment - భక్తిమార్గము. Through train - జ్ఞానము. మొదటిది, సామాన్య రైలు ప్రయాణం – కర్మమార్గము. కర్మమార్గంలో కొన్ని అడ్డములు వస్తుంటాయి. ఉపాసనా మార్గములో కొన్ని సుఖములుంటాయి. జ్ఞానమార్గములో ఎట్టి బాధలూ ఉండవు. కారణం ఏమిటి? అది ఒక్కటే తత్త్వము. "అద్వైత దర్శనం జ్ఞానం." అనేకత్వముతో కూడినదే ఉపాసన. భిన్నత్వముతో కూడినదే కర్మోపాసన. అనేకత్వములోని ఏకత్వమే జ్ఞానము. కనుక కర్మ ప్రధానమైనది. ఈ కర్మచేతనే మనం ఉపాసనను

sri sathyasai vahini amrutam

సాధించవచ్చు. ఈ అన్నింటియందు కర్మ చాలా ప్రధానమైనది. కర్మ చేయక ఎట్టి ఉపాసనలూ మనం చేయలేము. ఈ ఉపాసన లేక ఎట్టి జ్ఞానమూ మనము పొందలేము. ఈ మూడింటియొక్క ఏకత్వమే నిజమైన ఆత్మతత్త్వము.

**"తస్మై నమః కర్మణే"**

మనము కర్మ వేరని, ఉపాసన వేరని, జ్ఞానము వేరని భావించి అనేక విధములైన మార్పులు చేసుకొని సందేహములకు అవకాశము ఇవ్వకూడదు. దేహముచే బంధింపబడినది కర్మ. జన్మమునకు మూలకారణము కర్మ. కర్మచేత జన్మము మనకు ప్రాప్తిస్తున్నది. కనుక ఈ కర్మకు మనం మొట్టమొదట నమస్కరించాలి. ఇదియే ఉపనిషద్ ప్రబోధ. "ఓ కర్మా! నీకు మొట్టమొదట నమస్కారము. ఎందుకోసం? నాచేత, దేహము చేత, ఈ కరచరణాది అవయవముల చేత సత్కర్మలు ఆచరింపచేయి. అందుకోసం నీకు నమస్కారము", అన్నారు. 'కర్మానుబంధీని మనుష్యలోకే'. మానవ లోకమంతా కర్మచేతనే బంధింపబడింది. కర్మలంటే ఏమిటి? మనము చేతులతో చేసేదానిని కర్మగా భావిస్తున్నాము. కాదు. కాదు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడా కర్మయే. ఎట్టి ప్రయత్నమూ లేక జరిగిపోతున్నది. గుండె కొట్టుకుంటున్నది. దీనికి నీవు ఏమైనా ప్రయత్నము చేస్తున్నావా? ఎట్టి ప్రయత్నమూ లేక సహజముగా ఆడుతున్నది గుండె. రక్తము దేహములో ప్రసరిస్తున్నది. దీనికి నీవు ఏ ప్రయత్నము చేస్తున్నావు? ఏ ప్రయత్నమూ చేయనక్కరలేదు. ప్రయత్నములేక జరిగేవన్నీ కర్మోపాసనలే. గాలి లేక క్షణమైనా జీవించలేవు. గుండె కొట్టుకోక క్షణమైనా బ్రతుకలేవు. రక్తము ప్రసరించక దేహమును ఏమాత్రము కాపాడుకోలేవు. సర్వమూ కర్మచేతనే పోషింపబడుతున్నది. కర్మచేత రక్షింపబడుతున్నది. కనుక, కర్మకు మనకు ప్రాధాన్యత నివ్వాలి. కర్మ అల్పముగా మనము భావించరాదు. కర్మ చాలా అధికమైనది, ఉత్తమమైనది. అన్నింటికి మూలకారణమైనది. మూలాధారమైనది. మన మూలాధారమునుండి సహస్రారమువరకు కర్మ జరుగుతున్నది. ఈ సహస్రార పద్మమునుండి ఆవిర్భవించినదే ప్రజ్ఞానము. ఈ ప్రజ్ఞానమువలనే సర్వము జరుగుతున్నది. 'ప్రజ్ఞానం బ్రహ్మ.' అదే వేదము చెప్పింది. ఏది బ్రహ్మ? ఎవరిచేతనో సృష్టించబడినది కాదు, ఎవరిచేతనో నడిపింపబడేదికాదు. తనంతటా తానే జరిపేది. ఎవరూ అడ్డు చేయటానికి లేదు. సహజమైనది,

srisathyasaivachanamrutam

స్వాభావికమైనది, నిత్యమైనది, సత్యమైనది, నిరుపమానమైనది. ఇలాంటి తత్త్వమును ప్రజ్ఞానము అన్నారు.

**ఆత్మ, అహం, మనస్సు, వాక్కు ఒకే కుటుంబమునకు చెందినవి**

ఈనాడు పిల్లలు పల్లెల అభివృద్ధి చూసుకుంటున్నారు. Rural development అంటే ఏమిటి? పల్లెల్లో ఇండ్లు కట్టటమే కాదు. ఒక్కొక్క దేహము ఒక్కొక్క పల్లె. దేహమనే పల్లెలో కాళ్లు గృహము, చేతులు గృహము, ముఖము గృహము, నోరు, చెవులు కట్టడములే. అన్నింటి సమత్వము గుర్తింపచేసేదే Constant integrated awareness. మనస్సు తలచినప్పుడు కాళ్లు కదలిపోతున్నాయి. మనసు సంకల్పించినప్పుడు చేతులు పని చేస్తున్నాయి. మనస్సు ఇష్టపడినప్పుడు కన్నులు చూడగలుగుతున్నాయి. మనసు ఆశించినప్పుడు చెవులు వినగలుగుతున్నాయి. కనుక మనసే అన్ని ఇంద్రియములకు మాష్టరు. దేహము క్రిందది. దానిపైన senses. దానిపైన మనస్సు. దానిపైన బుద్ధి. దానిపైన ఆత్మ, ఆత్మకు అత్యంత సమీపములో నున్నది బుద్ధి; కనుక 'బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్'. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః.' మనస్సే అన్నింటికి మూలకారణము. దేహముతో కర్మలాచరింప చేసేది మనసే. సత్కర్మల చేత ఆనందమును అనుభవించేది మనస్సే. దుష్కర్మల చేత దుఃఖించేది మనస్సే. కాని దానికి, దీనికి ఎట్టి సంబంధమూ లేదు. దేహముతో చేసే కర్మ ఉపాసన జ్ఞానములన్నీ దేహమునకు మాత్రమే సంబంధించినవి. కర్మ అనిత్యం. భక్తి అనిత్యం. జ్ఞాన మనిత్యం. దేనివల్ల? దేహమనిత్యం. అందువల్లనే "అనిత్యం అసుఖం లోకం." కనుక నిత్యసత్యమైన దాని నిమిత్తమై భజించు. కాన కర్మ మొట్టమొదట మార్గాన్ని చూపించింది. ఆ కర్మను ఆధారము చేసుకొనే ఉపాసన అభివృద్ధి అవుతున్నది. ఉపాసన అభివృద్ధి కావటంచేత జ్ఞానము అభివృద్ధి అవుతున్నది. పుట్టినప్పుడు పసిబిడ్డ. పది సంవత్సరములకు బాలుడు. ముప్పది సంవత్సరములకు యువకుడు. 75 సంవత్సరములకు తాత. పసిబిడ్డ, బాలుడు, యువకుడు, గ్రాండ్ ఫాదర్ నలుగురు ఒక్కరేగానీ వివిధ రూపములు వివిధ నామములే. ఇవి భిన్నమైనవి కాదు.

నేను పూర్వము చెప్పాను. ఆత్మ నుండి అహం పుట్టింది. అహం నుండి మనస్సు

sri sathyasai vachanamrutam

పుట్టింది. మనస్సు నుండి వాక్కు పుట్టింది. కాబట్టి ఆత్మ నుండి పుట్టిన అహం ఆత్మకు కుమారుడు. 'నేను' అనేది మొట్టమొదటి పేరు భగవంతునకు. ఓం అనే పేరుకంటె మొదటిది. ఆత్మనుండి అహం పుట్టింది. అహం నుండి మనస్సు పుట్టింది. మనసు ఆత్మకు గ్రాండ్‌సన్. మనస్సునుండి వాక్కు పుట్టింది. వాక్కు ఆత్మకు గ్రేట్ గ్రాండ్‌సన్. అహం, మనసు, వాక్కు ఆత్మనుండి పుట్టినవే. ఆత్మ కుటుంబమే. కనుక, మనస్సుకు ఆత్మభావము ఆవిర్భవించాలి. అంతేకాదు, వాక్కునందుకూడా ఆత్మభావము రావాలి. అహంతత్త్వం నుండి ఆత్మ ఆవిర్భవించాలి. ఇలాంటి వాటిని భిన్నముగా భావించుకోటం విరుద్ధము.

ఉమ్మడి కుటుంబములో ఎంత ఐకమత్యము ఉంటున్నది! కుటుంబము ఛిన్నా భిన్నమైనప్పుడు ఎంతబలము తగ్గిపోతుంది! అనేక దారములు చేరి వస్త్రం అయింది. కనుక, దీనిని తెంపటానికి వీలుకాదు. చాలా గట్టిగా ఉంటుంది. దానిలో దారములు ఒక్కొక్కటి వేరు చేస్తే వేళ్లతో తుంచి వేయవచ్చు. ఉమ్మడి కుటుంబమును భిన్నభిన్నముగా చేసుకోటంచేత మనం దురవస్థలకు గురౌతున్నాము. ఆత్మ, అహం, మనసు, వాక్కు ఒకే కుటుంబము. ఈ నాల్గింటికి ఒకే common property, అదే ప్రజ్ఞానం. అహంలో ఉంది, మనస్సులో ఉంది. వాక్కులో ఉంది. వేదమునందు "అహం బ్రహ్మాస్మి", "ప్రజ్ఞానం బ్రహ్మ", "అయమాత్మా బ్రహ్మ", "తత్ త్వం అసి" అనేవి మహావాక్యములు. ఈవిధంగా, అన్నింటియందు ఏకత్వమునే ప్రబోధిస్తూ వచ్చింది.

**నేటి మానవుడు తనను తానే నమ్మలేకపోతున్నాడు**

ఈనాడు brotherhood of man అనే దాన్ని కూడా మనం విశ్వసించరాదు. అందరూ సోదరభావము అనుకుంటారు. సోదరభావముతో కలసిమెలసి ఉన్నవారంతా ఎంతమంది సుప్రీంకోర్టువరకు పోయి జగడము వేయుటము లేదు! సోదరులలో భేదాభిప్రాయములు కల్గి ద్వేషమును పూనుతున్నారు. దీనికంటే ఏకాత్మ భావము చాలా ఉత్తమమైనది. అందరియందున్న ఆత్మ ఒక్కటే. ఈ భావము మనలో ఆవిర్భవించినప్పుడు ద్వేషమునకు అవకాశము లేదు. మనము మాయ అని మాయను మాత్రమే నెట్టుకుంటున్నాము గానీ అది మాయ కాదు. నీ భ్రమయే. నీ తత్త్వము నీవు విశ్వసించలేకపోతున్నావు. నిన్ను నీవు

srisathyasaivachanamrutam

విశ్వసించలేకపోతున్నావు. కారణం ఏమిటి? ఆత్మవిశ్వాసము కోల్పోవటంచేత ఈ అవిశ్వాసము అభివృద్ధి అవుతూ వచ్చింది. ఇంతేకాదు. ఉపాధియొక్క సంబంధ బాంధవ్యము మనము పెంచుకుంటూ పోతున్నాము. "నా తల్లి, నా తండ్రి, నా సోదరుడు" అని దేహాభిమానముచేత కట్టుబడిపోతున్నాం. కృష్ణుడు మన్ను తిన్నాడని, "మన్ను తిన్నావా నాయనా? నోరు తెరు" అంది యశోద. నోరు తెరిచాడు, ఆమెకు 14 లోకములు కనిపించాయి. నమ్మలేకపోయింది.

**కలయో వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో సత్యమో**
**తలపన్నేరక యున్నదాననో యశోదాదేవిగానో పర**
**స్థలమో బాలకుడెంత? యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర**
**జ్వలమై యుండుట కేమి హేతువో మహాశ్చర్యంబు చింతింపగన్**

తనకు తానే నమ్మలేకపోతున్నాది. అట్లే, ఈనాటి మానవుడు తనను తానే నమ్మలేకపోతున్నాడు. తనను తాను నమ్మలేని మానవుడు ఇతరులను ఏరీతిగా నమ్మగలడు? మొట్టమొదట ఆత్మవిశ్వాసము రావాలి. దానిని అభివృద్ధి చేసేదే కర్మ. ప్రతి action కు reaction ఉంటున్నది. ప్రతి sound కు resound ఉంటున్నది. Reality కి reflection ఉంటున్నది. అదే నిజమైన దైవత్వము. అదే ప్రజ్ఞానము.

**స్వార్థరహితుడైన, నిజమైన స్నేహితుడు భగవంతుడొక్కడే!**

ఉపాసన అనగా ఏమిటి? ఉపాసన అనేక మార్గములలో చెబుతూ వచ్చారు.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనం.**

దేనినైనా మనం ఉపాసన చేయవచ్చు. అన్నింటికంటె ప్రధానమైనది, మూలాధారమైనది స్నేహం. Real friend, helping friend భగవంతుడు ఒక్కడే! తల్లి కొంతవరకు స్వార్థస్వప్రయోజనాలకు ప్రేమిస్తుంది. తండ్రి కొంతవరకు స్వార్థ స్వప్రయోజనాలకు ప్రేమిస్తాడు. కానీ దైవమునకు ఎట్టి స్వార్థమూ లేదు, నిరంతరము అర్పితమే. స్వార్థరహితుడైన నిజమైన స్నేహితుడు భగవంతుడొక్కడే! అట్టి పరమాత్మతో మనము స్నేహము చేసుకోవాలి. స్నేహము

sri sathyasai vacharamrutam

తరువాత ఆత్మనివేదనం. రాముడు, సుగ్రీవుడు స్నేహితులైన తరువాత కార్యసాఫల్యము చేసుకున్నారు. స్నేహము లేక సుగ్రీవుడు ఇంతపనిలో పూనుకునేవాడు కాదు. అందువలనే కార్యము పూర్తి అయిన తరువాత రాముడు చెప్పాడు: "మేము ఆరుగురు అన్నదమ్ములము, నలుగురము కాదు. రామలక్ష్మణ భరత శతృఘ్నులు అయోధ్య నుండి వచ్చిన వారము, కిష్కింధ నుండి వచ్చిన సుగ్రీవుడు, లంక నుండి వచ్చిన విభీషణుడు మొత్తం ఆరుమంది అన్నదమ్ములము," అని. సుగ్రీవుడు లేక సీత జాడ తెలియదు. విభీషణుడు లేక రావణుని వధ జరిగేది కాదు. సర్వ శక్తులు దైవశక్తులే! పన్ను గుచ్చుకునే పుల్ల అయినా పనికి వస్తుంది. ప్రాణమున్న మనిషి లోకములో పనికిరాడా! ఎవరినీ మనం ద్వేషించరాదు. ఎవరినీ మనం వేరు చేయకూడదు. అందరినీ ఏకం చేయాలి. ఏకత్వముయొక్క తత్త్వము ఎంత పవిత్రమైనది! అదే అప్పుడప్పుడు పిల్లలకు చెబుతూ ఉంటాను. Unity in diversity.

Beings are many but breath is one
Nations are many but earth is one
Jewels are many but gold is one
Stars are many but sky is one

మానవులందరియందు దైవత్వము ఒక్కటిగానే ఉంటున్నది. దైవత్వము గుర్తించాలంటే కర్మోపాసన మనం తెలుసుకోవాలి. భజన, ధ్యానము, జపము ఇవన్నీ కేవలము సత్కర్మలు మాత్రమే.

**చెప్పటం ప్రధానం కాదు, ఆచరించటము ప్రధానం**

అయితే, అనుకున్నదానిని సాధించలేకపోతున్నాము. దీనికి కారణమేమిటి? భక్తియొక్క ప్రేరణచే ఆవిర్భవించిన పలుకులు ఆచరణలో పెట్టకపోవడమే! రామ భక్తులము అనుకుంటున్నాము. రాముని ఆచరణ మనము ఆచరిస్తున్నామా? రాముడు పితృవాక్య పరిపాలన చేశాడు. మనం చేస్తున్నామా? అన్నదమ్ముల ఏకత్వము విశ్వసించాడు. దానిని మనం చేస్తున్నామా? ఆడినమాట తప్పక రాజ్యము త్యజించి అరణ్యములో నివసించాడు. దానిని మనం ఆచరిస్తున్నామా? మన సత్యము మనం పాటిస్తున్నామా? మన వాగ్దానము మనము అనుసరిస్తున్నామా? ఏమిటి రామభక్తులంటే? పేరుకు రామభక్తులు గాని పెన్నిధియందు

sri sathyasaivahamrutam

పార్టనర్‌షిప్ లేదు. ఎప్పుడొస్తుందది? అతను ఆచరించినది ఆశించినది, ఆజ్ఞాపించినది నడచుకున్నప్పుడే పార్టనర్‌షిప్ వస్తుంది. కృష్ణ భక్తులమని అంటున్నాము కానీ కృష్ణునియొక్క ఆజ్ఞలు, కృష్ణుని తలంపులు మనం ఆచరిస్తున్నామా? ఆచరించటంలేదు. నీవు కృష్ణ భక్తుడవు ఎలా అవుతావు? సాయి భక్తులమంటున్నారు. సాయి ఆజ్ఞను ఎవరు పాటిస్తున్నారు? ఎన్ని సంవత్సరముల నుండో ఉంటున్నారిక్కడ. ఎన్ని ఉపన్యాసములో వింటున్నారు. ఇక్కడే పర్మనెంటు కాపురాలు చేస్తున్నారు. ఏమిటి ఆచరిస్తున్నారు? నాల్గవ వంతులో కొంచమైనా ఆచరించటం లేదు. సాయి అనుగ్రహానికి ఎలా పాత్రులౌతారు? వినటం ప్రధానం కాదు. కేవలం చెప్పటము ప్రధానంకాదు, ఆచరించటము ప్రధానం. కనుకనే

**అంధకారమెల్ల హతమారునే జూడ**
**వసుధలో దీపంపు వార్తవలన**
**ఆకొన్నవారికి ఆకలి తీరునే**
**పంచ భక్ష్యముల పాకంబు విన్న**
**నిరుపేదవాని పేదరికంబు పోవునా**
**విత్త ప్రభావంబు విన్నయంత**
**రోగపీడితుని బల్ రోగముల్ పోవునా**
**ఔషధ మహిమంబు విన్నయంత**

అట్లనే మనము రామాయణము పఠిస్తున్నాము. భాగవతాలు పఠిస్తున్నాము. భగవద్గీత వల్లె వేస్తున్నాము. పారాయణములు చేస్తున్నాము. ఎన్ని చేసి ప్రయోజనం ఏమిటి? ఇవన్నీ కేవలం గ్రంథ పరిచయము మాత్రమే. కానీ ఆచరణ కావాలి. ఒక్కటైనా ఆచరణలో పెడితే చాలు. ఈవిధంగా చూస్తే "మేము భక్తులమ"ని చెప్పుకోవటమే చాలా అవమానంగా ఉంటుంది. ఏదో ఉన్నారు సమీపములో, కమలములచెంత కప్పలున్నట్లుగా. కానీ, దూరమునుండి వస్తున్నాయి తుమ్మెదలు, ఆ పుష్పములోని మకరందము త్రాగిపోతున్నాయి. Near కాదు important, dear గా ఉండటం important. కానీ, మనం అనుభవించటానికి near, dear రెండూ ఉండాలి. ఒక్కటైనా ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. ఆచరణలో లేనప్పుడు ఎన్ని

sri sathyasaivachanamrutam

విన్నా కేవలం టేపురికార్డు మాదిరి ఉంటుంది.

నీ హృదయంలో చేరిన భావాలంతా ప్రేమతో భగవంతుని కరిగించాలి. అప్పుడే నీ హృదయమునుండి ఆవిర్భవించేది బయటకు వస్తుంది. కనుక భగవంతునితో connection పెట్టుకోవాలి. నీవు collect చేసే matter అంతా భగవంతునితో connection చేయాలి. అప్పుడే నీవు select చేసుకున్నవాడవు అవుతావు. ఆ selection నీ ఇష్టం. అదే ఇచ్ఛాశక్తి. ఆ ఇచ్ఛాశక్తియే క్రియా శక్తిగా మారుతుంది. క్రియాశక్తియే జ్ఞానశక్తిగా మారుతుంది. ఈ ఇచ్ఛాశక్తి క్రియాశక్తి, జ్ఞానశక్తి ఈ మూడింటియొక్క స్వరూపములే కర్మ, ఉపాసన, జ్ఞానము. కనుక ప్రతికర్మను చిత్తశుద్ధితో చేయాలి. ఏమి చేసినా అది భగవత్కర్మగా మనం విశ్వసించాలి. సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థముగా ఆచరించాలి. ఇది చాలా సులభమైన మార్గము. అది తప్పక భగవంతుని చేరిపోతుంది. కనుక కర్మ, ఉపాసన, జ్ఞానములు ఒకదానికంటె ఒకటి చిన్నది మరొకటి పెద్దది అని భావించరాదు. అన్నీ కూడా ఏక స్వరూపము పొందినవే. కనుక దీనిలో భిన్నత్వము ఏమాత్రము లేదు. రూపనామములు వేరువేరుగా ఉండవచ్చును. కానీ ఆత్మతత్త్వము ఒకటే! ఇందులోని ఏకాత్మభావాన్ని విశ్వసించి, నిజ మార్గములో ప్రవేశించి, దైవత్వమును అనుభవించటం ప్రతి మానవునికి ప్రధాన కర్తవ్యము.

1996 జూన్ 30వ తేది  సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam